ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

కార్మిక హక్కులపై మోడీ సర్కారు దాడి

◆ ఐక్య పోరాటాలతో తిప్పికొడదాం : సాయిబాబు

◆ విశాఖలో సిఐటియు 18వ జాతీయ మహాసభలు

◆ ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారిగా ఎవి.నాగేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐటియు అఖిల భారత కోశాధికారి సాయిబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కార్మిక చట్టాలు, హక్కులపై కేంద్రంలోని మోడీ సర్కారు తీవ్ర దాడి చేస్తోందని, ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు అఖిల భారత కోశాధికారి సాయిబాబు అన్నారు. సిఐటియు 18వ జాతీయ మహాసభలు పోరాట కేంద్రమైన విశాఖ వేదికగా ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1300 మంది ప్రతినిధులు ఈ జాతీయ మహాసభలో పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ విధివిధానాలు ఆర్థిక స్వావలంభనను నాశనం చేశాయని అన్నారు. బహుళ జాతి కంపెనీలకు, కార్పొరేట్లకు అనుకూల నిర్ణయాలే చేస్తున్నారన్నారు. వీటిని తిప్పికొట్టేందుకు కార్మిక శక్తి అంతా ఒక్కటవ్వాల్సిన అవసరముందన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న ఎన్నో పోరాటాలకు తలమానికంగా సిఐటియు నిలిచిందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటమే దీనికి నిదర్శనమని అన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో సిఐటియు చేసిన పోరాటాలను గుర్తుచేశారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలను తెలియజేశారు. జులై 9న జరగనున్న సమ్మెను కార్మిక సంఘాల ఐక్యతను ప్రదర్శించే విధంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశ జిడిపిని ప్రభావితం చేసే అన్ని రంగాలూ మోడీ హయాంలో కుదేలయ్యాయని అన్నారు. వచ్చే దశాబ్దం వరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ప్రణాళికలేవీ ప్రభుత్వం వద్ద లేవని అన్నారు. కార్పొరేట్ల లాభాల కోసమే కార్మిక రంగంపై దాడులు జరుగుతున్నాయన్నారు. రైల్వే, డిఫెన్స్ రంగాల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. లేబర్ కోడ్స్ అమలు కాకుండానే అందులోని అంశాలను అమలు చేసేందుకు పలు రాష్ట్రాలు ముందుకు వస్తున్నాయని, ఈ క్రమంలోనే పని గంటల పెంపు వంటి మిగతా 2లో..

ఎంఎస్ఎంఇ పార్కులకు బాలారిష్టాలు

◆ ఎపిఐఐసి భూముల గుర్తింపు ◆ లేనిచోట స్థల సమస్య

◆ నిధులు కేటాయించని ప్రభుత్వం

కోడూరులోని ఎంఎస్ఎంఇ పార్కు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) పార్కుల అభివృద్ధి ప్రతిపాదనల దశలోనే ఉంది. బాలరిష్టాలు వెంటాడుతున్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలనుకున్న పార్కులకు అనువైన స్థల అన్వేషణ ఎప్పటి నుంచో సాగుతోంది. ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ స్థలాలను కావాల్సిన వారికి కట్టబెట్టడం, వ్యవసాయేతర కార్యక్రమాలకు వినియోగిస్తున్న భూమికి పరిహారం చెల్లించి సేకరించడానికి సర్కారు ముందుకు రాకపోవడంతో ఎంఎస్ఎంఇల ఏర్పాటు మాటలకే పరిమితమవుతున్నాయి. కొత్తగా స్థలాలను గుర్తించే పనిచేయకుండా ఎపి పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కి చెందిన భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. తనచేతిలోని పైసా ఖర్చుపెట్టకుండా ఎపిఐఐసి భూములు, డబ్బులతో అభివృద్ధి చేసిన అనువైన స్థలాలను పార్కుల కింద ప్రభుత్వం ప్రకటిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కును అభివృద్ధి చేయాలని గత బుధవారం జరిగిన మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. కానీ ఎంఎస్ఎంఇ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వ స్థలాల గుర్తింపు, లేనిచోట భూ సేకరణ, నిధులు కేటాయింపు అంశాలేవీ ప్రభుత్వం ప్రకటించలేదు. ఎంఎస్ఎంఇల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ ఆలోచన కార్యరూపం దాల్చే అవకాశం లేదు.

కోడూరులో ఎపిఐఐసి అభివృద్ధి చేసిన ఎంఎంఎస్ఇ పార్కును ఈ నెల 6న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ హడావిడిగా ప్రారంభించారు. నిధులు కేటాయించకుండా ఎపిఐఐసి అభివృద్ధి చేసిన స్థలాల్లో ఎంఎస్ఎంఇ పార్కులను అభివృద్ధి చేయాలనే యోచనలో ప్రభుత్వం వుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గుర్తించిన ఎంఎస్ఎంఇ పార్కుల్లో మిగతా 2లో..

అంధ మహిళల క్రికెట్ పోటీలు ప్రారంభం

▶ వార్త 4లో..

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా వాణి

▶ వార్త 2లో..

అధికార లాంఛనాలతో పల్లా సింహాచలం అంత్యక్రియలు

▶ వార్త 4లో..

అస్త్రం యాప్ ప్రారంభ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులతో మంత్రి అనిత, సిపి శంఖబ్రత బాగ్చీ

అస్త్రం యాప్ ప్రారంభం

ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం : మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర వాసులకు ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో 'అస్త్రం' యాప్‌ను ప్రారంభించామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆమె అస్త్రం యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు రియల్ టైమ్ ట్రాఫిక్ సమాచారం అందించడమే ఈ యాప్ ఉద్దేశమని మిగతా 2లో..

వెబ్ కౌన్సెలింగ్‌పై..

ఉపాధ్యాయుల నిరసనాగ్రహం

డిఇఒ కార్యాలయం ముట్టడి

విశాఖ డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 'మాయాదారి వెబ్ వద్దు.. మాన్యువలే ముద్దు' అంటూ ఉపాధ్యాయులు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఉదయం నుంచీ నిరసన నినాదాలతో డిఇఒ కార్యాలయం పరిసరాలు హోరెత్తాయి. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించినా ఉపాధ్యాయులు వెనుకడుగువేయలేదు. డిఇఒ కార్యాలయ ముట్టడి సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మాత్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా వందలాది ఆప్షన్స్ ఎంచుకోవడం చాలా కష్టతరమని పేర్కొన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్‌లో అయితే ఆయా స్థానాలపై అవగాహనతో ఎంచుకోవడం సులభమవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉపాధ్యాయుల అభీష్టం మేరకు నడుచుకోవాలన్నారు. గత ప్రభుత్వం విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాల ప్రమేయం లేకుండా పనికిమాలిన నిర్ణయాలు చేసి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్మిక హక్కులపై మోడీ సర్కారు దాడి

నిర్ణయాలను పలు ప్రభుత్వాలు తీసుకుంటున్నాయని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సిఐటియు పోరాటం మూలంగానే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో నిలిచిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఆర్‌ఎస్‌ఎస్ వారిని సిఎమ్‌డిలుగా నియమిస్తున్నారని, కార్మికపోరాటాన్ని అణిచివేయాలని చూస్తున్నారని తెలిపారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖను ఒక ప్రయోగశాలగా చూస్తోందని, సంఘం జాతీయ మహాసభ ద్వారా దానికి సమాధానం చెప్పాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడ యూనియన్లు లేకుండా చేయాలని, అనంతరం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూస్తోందని అన్నారు. నాడు డిసిఐ రక్షణ పోరాటంలో ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చి పవన్ కల్యాణ్ రాజకీయాల్లో తొలి అడుగు వేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయనే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్న ఎన్‌డిఎ పక్షాన నిలవడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధాల సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడారు.

ఆహ్వాన కమిటీ నియామకం

కార్యక్రమంలో భాగంగా సిఐటియు 18వ జాతీయ మహాసభల అహ్వాన కమిటీని ప్రకటించారు. ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారిగా ఎవి.నాగేశ్వరరావు ఉంటారు. ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా కెఆర్‌కె.మూర్తి, ఎం.జగ్గు నాయుడు, ఎకామిడేషన్ కమిటీ సభ్యులుగా ఎవి.నాగేశ్వరరావు, ఆర్‌వి.నరసింహారావు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎ.నాగరాజు, పి.మణి, లోకేష్, ట్రాన్స్‌పోర్టు కమిటీ సభ్యులుగా ముజఫర్ అహ్మద్, కెఎం.శ్రీనివాస్, బి.జగన్, ఒ.అప్పారావు, ఫుడ్ కమిటీ సభ్యులుగా కె.ఉమామహేశ్వరరావు, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, కెఆర్.రాయ్, దయా రమాదేవి, మాదాల వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస్, మంగశ్రీ, కల్చరల్ కమిటీ సభ్యులుగా కె.మురళి, జి.బేబీ రాణి, లక్ష్మణమూర్తి, సావనీర్ కమిటీ సభ్యులుగా వి.ఉమామహేశ్వరరావు, కె.ఉమామహేశ్వరరావు, వాలంటీర్ కమిటీ సభ్యులుగా కుమార్, జి.కోటేశ్వరరావు, పి.తేజేశ్వరరావు, వెంకట్ రెడ్డి, ప్రతినిధుల హాల్ కమిటీ సభ్యులుగా జి.ఓబులు, కె.ధనలక్ష్మి, మేరీ, బహిరంగ సభ ప్రచార కమిటీ సభ్యులుగా కె.సుబ్బారావు, కె.సుబ్బరావమ్మ, అజయ్ కుమార్, డెకరేషన్ కమిటీ సభ్యులుగా కుమార్, వి.రాజు, ఎం.సుబ్బారావు, ఎగ్జిబిషన్ కమిటీ సభ్యులుగా పి.అజయ్ కుమార్, ఎ.సీతాలక్ష్మి, సెంటర్ ఆఫీస్ సభ్యులుగా కెఆర్‌కె.మూర్తి, రామస్వామి, సోషల్ మీడియా సభ్యులుగా దయా రమాదేవి, ఎల్‌జె.నాయుడు, ప్రెస్ కమిటీ సభ్యులుగా కుమార్ మంగళం నియమితులయ్యారు. మెడికల్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది.

ఎంఎస్‌ఎంఇ పార్కులకు బాలారిష్టాలు

అత్యధికం ఎపిఐఐసి స్థలాలే వున్నాయి. అనకాపల్లి నియోజకర్గం పరిధిలోని కోడూరులో తాజాగా ఒక పార్కు ప్రారంభించగా, ఇంకా మిగిలిన నియోజకవర్గాల్లో వీలైనంత తొందరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నా అందుకు స్థలాలు సిద్ధంగా లేవు. పెందుర్తి నియోజకవర్గం పరవాడలో ఎపిఐఐసి భూమి 116 ఎకరాల్లో పార్కు అభివృద్ధికి గుర్తించారు. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఉప్పుపర్రకు చెందిన 124.94 ఎకరాలు, పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉపమాకలో ల్యాండ్ పార్శిల్‌లోని 50 ఎకరాలు, మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలం ఆర్లె, కింతాడ, గొండుపాలెం, గరుగుపాలెం, గుల్లెపల్లిలోని ప్రభుత్వ భూమి వంద ఎకరాలు, చోడవరం నియోజకవర్గంలోని చోడవరం మండలం దుద్దుపాలెంలో వంద ఎకరాలు, నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండలం శృంగవరంలో 50 ఎకరాలను ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధికి గుర్తించారు.

దుద్దుపాలెంలో 2023 మే 25న వంద ఎకరాలను ఎంఎస్‌ఎంఇకు కేటాయించాలని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు. కోటపాడు మండలంలోని ఆర్లె, కింతాడ, గొండుపాలెం, గురుగుపాలెం, గుల్లెపల్లిలో వంద ఎకరాల భూమిని ఎపిఐఐసికి కేటాయించాల్సివుంది. ఈ భూమిలో కొంతమంది పేదరైతులు సాగులో వున్నారు. ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధిపై బాలారిష్టాలు తొలగించకపోతే ఇదొక స్వప్నంగానే మిగలనుంది.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా వాణి

రాష్ట్ర కేంద్రం నుంచి ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఎంటి.కృష్ణ బాబు నుంచి ఆదివారం ఉత్తరులు వెలువడ్డాయి. డాక్టర్ ఐ.వాణి ఆంధ్ర మెడికల్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 15 రోజులలోగా ఆమె కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంతవరకు కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.శివానంద అడిషనల్ ఛార్జి హోదాలో కొనసాగుతూ వచ్చారు. ఆయన కెజిహెచ్ ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు.

అస్త్రం యాప్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..) తెలిపారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వినియోగదారులు విశాఖలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే తెలుసుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానానికి త్వరగా చేరుకోగలరని అన్నారు. అలాగే తమ పరిసరాల్లో యాక్సిడెంట్లు జరిగినా, ట్రాఫిక్ జామ్‌లు ఉన్నా, వాటిని యాప్ ద్వారా ఇతరులకు తెలియజేయవచ్చని తెలిపారు. విశాఖ ఒక విఐపి నగరమని, ఇక్కడ నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకే ప్రజలందరూ ఈ యాప్‌ను వినియోగించుకోవాలని, ఇది ప్రజల కోసం రూపొందించిన యాప్ అని పేర్కొన్నారు. విశాఖ వాసిగా ట్రాఫిక్ కష్టాలను తాను ప్రత్యక్షంగా చూసినట్లు అనిత తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసనాగ్రహం

(మొదటి పేజీ తరువాయి..) తమ సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జెడి) విజయ భాస్కర్‌కు, విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గోపీనాథ్, ఇమంది పైడిరాజు, చిన్నబ్బాయి, టి.రామకృష్ణారావు, అరుణ్ కుమార్, వీరభద్రరావు, సూర్యనారాయణ తది తరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IVth ADDITIONAL DISTRICT JUDGE (SC & ST COURT) AT SRIKAKULAM

IA NO:498/2024 OS NO:39/2024

BETWEEN:
DIVVALA MADHURI ... **Plaintiff**
AND
DUVVADA VANI and 6 others ... **Defendants**
To
D-7: SANAPALA PRATIBHA W/o sanapala Bharat, aged: 40 years R/at C/o Sanapala Jagannadha Rao Rtd SBI officer, MVV City, Opp. Stadium, Madhuravada, Visakhapatnam City and District,

NOTICE

Please take notice that the above **IA 498/2024 OS 39/2024** against you others and the same is posted to **17.06.2025** for your appearance before the Honourable court therefore you are hereby directed to appear before the Honourable court on **17.06.2025** at **10.30** A.M either in person or through an Advocate for failing counter if any other wise which the matter will be decided in your absence.

KONKYANA SUBHASH
Advocate, Chittaranjan Veedhi, SRIKAKULAM, Cell: 98491 40211

NOTICE

IN THE HONOURABLE COURT OF XIII ADDITIONAL DISTRICT JUDGE AT GAJUWAKA
E.A.135/2024 in E.P. /2024
O.S. No. 126/2016

Between
Chiruvuri Tirupathi Raju (died) and 3 others **...DHR/Plaintiffs**
And
Sajja Yashwantha Rao (died) and 3 others **...JDRs/Defendants**
To
Jdr No.3. Sajja Nagendra Babu, S/o (L) Yashwantha Rao, aged 45 years, Door No. 31-5-5, Kurmannapalem, Gajuwaka, Visakhapatnam.
Jdr No.4. Nalluri Nagini, D/o (L) Yashwantha Rao, aged 46 years, Door No. 31-5-5, Kurmannapalem, Gajuwaka, Visakhapatnam.

Take notice that the application filed by the above DHRs is posted for hearing at 10.30 a.m. on 16-06-2025 before the above said Court and if you want to contest the matter you may do attend so either in person or by a duly instructed pleader and if you fail to show cause the matter will be decided in your absence and exparte. Take notice that in default of your appearance on that day and hour before mentioned the application will be heard and determined in your absence given under my hand and seal of the court.

Hearing date: 16-06-2025
LANKA SRINIVAS KUMAR
ADVOCATE AP/1992/1995
F.F.-1,#39-6-59/1/3, Indumathi Residency Muralinagar, Visakhapatnam-530007
Cell: 9848199706

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA379/2024 FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకర రావు (డైడ్) వగైరాలు

నోటీసు

టు
R 50 : Ms పోతుల గీత W/o పోతుల లక్ష్మణ రావు, చినదొడ్డిగల్లు గ్రామం, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా-531081.
R 51 : Ms పద్మ W/o లేటు అనిల్ కుమార్, చినదొడ్డిగల్లు గ్రామం, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా, పిన్-531081.

పై నెంబరు FDP 1/2010లో 13వ రెస్పాండెంటు అయిన వెలగా సుగుణవతి గారు కాలం చేసినందున, మీరు ఆమె యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషను లో పార్టీ గా చేర్చమని కోరుచు పిటిషను దాఖలు చేయగా, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.17-06-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనర్ తరపు న్యాయవాది
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు.
యలమంచిలి **అడ్వకేట్లు, యలమంచిలి**
తేదీ.08-06-2025

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA380/2024 FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకర రావు (డైడ్) వగైరాలు

నోటీసు

R 60 : చిక్కాల లచ్చన్న దొర S/o లేటు చలపతిరావు, 5-14-85/1, సమితి ఆఫీస్ వీధి, 16వ వార్డు, తుని, కాకినాడ జిల్లా.
R 61 : చిక్కాల వెంకట రామారావు S/o లేటు చలపతిరావు, 9-131, ధర్మరాజువారి వీది, పెదపాడు గ్రామం & మండలం,534437,పశ్చిమగోదావరి జిల్లా
R 62 : చిక్కాల మంగపతి రావు, S/o లేటు చలపతి రావు, 16-1-20, ప్లాట్ నెం 46, వార్డు-16, బత్తిన వెంకటరాజు కొలని, తులసి సిరి లే అవుట్, సామర్లకోట 533440, కాకినాడ జిల్లా.

పై నెంబరు FDP 1/2010లో 37వ రెస్పాండెంటు అయిన చిక్కాల అన్నపూర్ణ గారు కాలం చేసినందున, మీరు ఆమె యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషను లో పార్టీ గా చేర్చమని కోరుచు పిటిషను దాఖలు చేయగా, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.17-06-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు.
అడ్వకేట్లు, యలమంచిలి
యలమంచిలి ఫోన్ : 9247895643
తేదీ.08-06-2025

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA381/2024 FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకర రావు (డైడ్) వగైరాలు

నోటీసు

టు
R 52 : చిక్కాల వీరేంద్ర శంకర్ S/o లేటు చిక్కాల అయ్యన్న దొర, D.No.20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, విజయవాడ-520003.
R 53 : చిక్కాల శ్రీరామ దొర S/o లేటు అయ్యన దొర, D.No.20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, విజయవాడ-520003.
R 54 : శ్రీమతి వెలగా రమ్య సుధ S/o లేటు అయ్యన దొర, D.No.20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, విజయవాడ-520003.

పై నెంబరు FDP 1/2010లో 21వ రెస్పాండెంటు అయిన చిక్కాల అయ్యన దొర గారు కాలం చేసినందున, మీరు అతని యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషనులో పార్టీగా చేర్చమని కోరుచు పిటీషను దాఖలు చేయగా, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.17-06-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు.
అడ్వకేట్లు, యలమంచిలి
యలమంచిలి ఫోన్ : 9247895643
తేదీ.08-06-2025

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA378/2024 FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకర రావు (డైడ్) వగైరాలు

నోటీసు

టు,
R 46 : ఉజ్జిన వెంకట రమణ @ ఆక శ్రీను S/o లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం-533 286, తూర్పు గోదావరి జిల్లా.
R 47: ఉజ్జిన గోపి S/o లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం-533286, గోదావరి జిల్లా.
R 48 : ఉజ్జిన నెహ్రు S/o లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం-533286, తూర్పుగోదావరి జిల్లా.
R 49: Ms గుత్తి దేవి D/o లేటు ఉజ్జిన సుబ్బారావు, ఉజ్జిన వెంకన్నగారి వీధి, నిడదవోలు, 534301

పై నెంబరు FDP 1/2010లో 12వ రెస్పాండెంటు అయిన ఉజ్జిన రమావతి గారు కాలం చేసినందున, మీరు ఆమె యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషనులో పార్టీగా చేర్చమని కోరుచు పిటిషను దాఖలు చేయగా, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.17-06-2025 ది ఉదయం 10.30ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు.
అడ్వకేట్లు, యలమంచిలి
ఫోన్ : 9247895643
యలమంచిలి
తేదీ.08-06-2025

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA382/2024 FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకర రావు (డైడ్) వగైరాలు

నోటీసు

R 55 : శ్రీమతి చిక్కాల చిన వెంకాయమ్మ W/o లేటు రఘురాం, C/o A.రాజు, గ్రామ సచివాలయం దగ్గర, పెంటకోట, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా
R 56 : చిక్కాల V.సీతారాం S/o లేటు రఘురాం, 101, 1st floor, సాయి తులసి అపార్ట్ మెంట్స్, బత్తాయి తోట వీది, తుని
R 57 : Ms K. గంగా భవాని C/o K.V.S. నారాయణ, రోడ్ నెం.10, జయంతి గార్డెన్స్, గ్రౌండ్ ఫ్లోర్, తేజ అపార్ట్ మెంట్స్, A.V. అప్పారావు రోడ్డు దగ్గర, రాజమండ్రి-533103.
R 58 : Ms B.ఆదిత్య C/o B.రాజేంద్ర, మౌలిక ల్యాబ్, బాజీ జంక్షన్, గోపాలపట్నం, విశాఖపట్నం-530027.
R 59 : MS అడపా రాజేశ్వరి W/o A.రాజు, గ్రామ సచివాలయం దగ్గర, పెంటకోట, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా

పై నెంబరు FDP 1/2010లో 22వ రెస్పాండెంటు అయిన చిక్కాల రఘురాం గారు కాలం చేసినందున, మీరు అతని యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషను లో పార్టీ గా చేర్చమని కోరుచు పిటిషను దాఖలు చేయగా, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.17-06-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు.
అడ్వకేట్లు, యలమంచిలి
ఫోన్ : 9247895643
యలమంచిలి
తేదీ.08-06-2025

గుడిలోవ ఛానల్ గెడ్డవాగు కబ్జాకు యత్నం

ప్రజాశక్తి- ఆనందపురం : పందలపాక రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు 85/10, 11లోని గుడిలోవ ప్రభుత్వ ఛానల్‌కు ఆనుకొని ఉన్న గెడ్డవాగును కొంతమంది అక్రమంగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నట్లు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలవలస మాజీ సర్పంచ్ అప్పలనారాయణ, ఆయన కుమారుడు సురేష్ ఈ కబ్జాకు నాయకత్వం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో గతం నుంచి ఉండే ప్రాధాన్యమైన మార్గాన్ని పూర్తిగా మూసివేసి, ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణకు దిగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రశ్నించిన గ్రామస్తులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. కబ్జా పనులు సెలవు రోజుల్లోనే చేపట్టి సుమారు 10 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఈ గెడ్డవాగు పక్కనే నివాసముంటున్న నిమ్మల సన్యాసినాయుడు, చిన్న, రమణ, కృష్ణ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. రహదారి మూసివేత వల్ల గ్రామ ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో తాత్కాలికంగా పనులను నిలిపివేసినప్పటికీ మళ్లీ కబ్జా యత్నాలు జరుగుతుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే పరిశీలించి ప్రభుత్వ భూమిని రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఉన్న రహదారి ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కబ్జాకు గురవుతున్న గెడ్డ వాగు

నేరాలు ఘోరాలు

కారు దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలంలోని శొంఠ్యాం గ్రామంలో ఓ కారులో శనివారం రాత్రి మంటలు చెలరేగి దగ్ధమైంది. దీనిపై కారు యజమాని బొద్దపు శ్రీనివాసరావు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహీంద్రా ఎక్స్ యువి 500 కారును శ్రీనివాసరావు తన స్థలంలో పార్క్ చేసి ఉంచారు. శనివారం రాత్రి11:30 గంటల సమయంలో కారు నుంచి మంటలు వస్తున్నట్లు స్థానికులు శ్రీనివాసరావుకు తెలియజేశారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకున్నారు. కారు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. వెంటనే ఆయన పోలీస్ హెల్ప్ లైన్ 112, ఫైర్ హెల్ప్ లైన్ 101కు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేశారు. మంటలు ఎలా అంటుకున్నాయన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దివీస్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ దివీస్ ఉద్యోగి శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా, ఉండ్రాజపురం మండలం, రజకులపేటకు చెందిన డి.సత్యప్రకాష్ (31) దివీస్ లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి సుమారు మూడేళ్ల క్రితం వివాహమైంది. జీవిఎంసి ఒకటో వార్డు బాలాజీ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సత్య ప్రకాష్ వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతున్నాడు. ఇంట్లో ఒక్క సారిగా స్పృహ కోల్పోయి నోట్లో నుంచి నురగలు రావడం గమనించిన భార్య వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుని భార్య లక్ష్మీదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ బి.తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..పాఠశాలలకు సెలవు దినాలు కావడంతో విజయనగరానికి చెందిన 14 ఏళ్ల బాలిక భీమిలిలో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఓ మహిళ మాయమాటలు చెప్పి బాలికను చేపల తిమ్మాపురంలో ఉన్న నూకరాజు ఇంటికి శనివారం తీసుకువెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బాలికపై నూకరాజు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నూకరాజుతో పాటు అందుకు సహకరించిన మహిళపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కెజిహెచ్‌కు తీసుకెళ్లారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని భావనకు పుస్తకాలు, స్కూల్ ఫీజు నిమిత్తం స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం రూ.6వేలు చెక్కును అందజేశారు. ఫౌండేషన్ కార్యాలయంలో ఈ సాయం అందించారు.

ల్యాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల 1986 - 88 బ్యాచ్‌కు చెందిన కొంతమంది పూర్వ విద్యార్థులు కలిసి ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థి పునీత్‌కు ఆదివారం ల్యాప్‌టాప్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, జి.సాయి, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు డిమాండ్ చేశారు. పిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. నగదు బదిలీ అమలు జరిగితే ప్రజా పంపిణీ వ్యవస్థ క్రమంగా బలహీన పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నువ్వు పంటకు మందు పిచికారి

ప్రజాశక్తి -పద్మనాభం : వేసవి పంటలో భాగంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో నువ్వు పంట రైతులు వేశారు. మండలంలోని మద్ది, వికెపాలెం, కృష్ణాపురం, పద్మనాభం, అనంతవరం, పాండ్రంగి గ్రామాల్లో నువ్వు పంటను రైతులు వేశారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా నువ్వు పంట పువ్వు నిలబడకపోవడంతో మందును పిచికారి చేస్తున్నారు.

ముత్యాలమ్మ గుడికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలంలోని పాలవలస గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త పాలవలస పరదేశి నాయుడు, పూజారి పి.నారాయణరావు, సర్పంచ్ అచ్చమ్మ, ఎంపిటిసి ఆర్.వెంకటరావు, భీమిలి వ్యవసాయ కమిటీ మాజీ డైరెక్టర్ రౌతు శ్రీను, బోర్ల గణపతి, పాలవలస సారధి, సర్పంచ్ చందక ఎల్లారావు, చందక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కాలువ సమస్యను పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ మార్కెట్ వద్ద కాలువ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్ వద్ద కాలువ పొంగి, రోడ్డుపై మురుగు నీరు ప్రవహించి ఇబ్బందిగా ఉండటంపై సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, జివిఎంసి 7వ వార్డు పరిధి మధురవాడ మార్కెట్ వద్ద ఎంతో కాలం నుంచి మురుగు కాలువ సమస్య ఉందన్నారు. కాలువ పై గట్టు పూర్తిగా శిథిలమైపోయిందని తెలిపారు. మరో వైపు ప్రధాన కాలువ వ్యర్థాలతో పూడిక పోయిందని చెప్పారు. దీంతో మురుగు నీరు కాలువ పొంగి రహదారిపై ప్రవహిస్తోందని తెలిపారు. మురుగు నీటిలో నడవలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పసిపిల్లలను తీసుకొచ్చేవారు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కారణంగా చిల్లర వర్తకులకు వ్యాపారాలు సాగడంలేదన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే పూడికలు తీయించాలని, శిథిలమైన కాలువను పూర్తిగా నిర్మించాలని డిమాండ్ చేశారు. మధురవాడ వంతెన కింద రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రహదారిలో వర్షం వస్తే చెరువుగా మారి ప్రయాణాలు ప్రమాదకరంగా ఉన్నాయని, దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజుకుమార్, డి.కొండమ్మ, టికె.శారద, డి.రవి, డి.అప్పలరాజు, ఐ.ఈశ్వరరావు, వై.వెంకటలక్ష్మి, లక్ష్మి, ఉమశైలు తదితరులు పాల్గొన్నారు.

'అమరావతి'పై వ్యాఖ్యల పట్ల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సాక్షి ఛానల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన చర్చలో 'ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేశ్యల రాజధాని' అంటూ పాత్రికేయుడు వివిఆర్.కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు ఆదివారం నిరసన తెలిపారు.

ఆనందపురం : మండలంలోని తెలుగుదేశం నాయకులు, మహిళలు ఆనందపురం పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సిఐ చింత వాసునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బమ్మిడి ఉమా, ఎల్‌వి.పాలెం సర్పంచ్ లోడగల రాజేశ్వరి, టి.అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు (చంటి), లోడగల వెంకటరావు, చందక శ్రీను, మద్ది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : అమరావతి రాజధానిని కించపరిచేలా, అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై పిఎం.పాలెం పోలీసులకు 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బోయి రమాదేవి, భవాని, పిళ్లా వెంకటరావు, బోయి శ్రీను, నాగోతి సత్యనారాయణ, గరే గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన పద్మనాభం సిఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

ఇంటర్ విద్యార్థి షేక్ అమీనాకు అభినందనలు

ప్రజాశక్తి -తగరపువలస : ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించిన భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన షేక్ అమీనాను ఆదివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ జివి.నారాయణ తదితరులు ఆమెను అభినందించి సత్కరించారు. ఈమె తగరపువలస శ్రీ బాసర జూనియర్ కళాశాలలో ఎం పి సి మొదటి ఏడాది చదివినట్లు తెలిపారు. భవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. షేక్ అమీనాను అభినందించిన వారిలో టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, జి.ఎల్లయ్య ఉన్నారు.

ఎన్ఎడిలో ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి -కరాస: ఎన్ఎడి ఉమియ భవన్ కల్యాణ మండపంలో హస్తకళలు చేనేత వస్తువుల ప్రదర్శన, ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్‌ను 52వ వార్డు టిడిపి అధ్యక్షుడు యామజాల తిరుమలరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల రోజులు పాటు ఈ బజార్ ఉంటుందని, చేతివృత్తుల కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. హస్తకళలు, చేనేత వస్తువులను ఉత్పత్తి ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ పేరుతో దేశంలోని వివిధ ప్రాంతాలలో లభ్యమయ్యే వస్తువులను ఒక చోటుకు తెచ్చి ప్రదర్శిస్తూ విక్రయిస్తున్నారని, ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనలో 28 స్టాళ్లలో ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి ముత్యాలు, కలంకారి పెయింట్స్, పోచంపల్లి చీరలు, ఖద్దరు షర్టులు, బీడ్స్ జ్యూవెలరీ, కార్పెట్స్, రాజస్థాన్ బెడ్ షీట్స్, బెంగాల్ కాటన్ శారీస్, కాటన్ డ్రస్ మెటీరియల్స్, మైసూర్ రోజ్‌వుడ్, టెరాకోట్, డోర్ కర్టెన్స్, దివాన్ షీట్స్, టాప్స్, కలంకారీ డ్రస్ మెటీరియల్స్, నైటీస్, బ్యాగులు, పటియాలా షూట్స్ ఈ ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు నరేష్, వీరయ్య తెలిపారు.

రైతులకు నష్టం.. పరిశీలించని అధికారులు...

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షం, గాలివాన కారణంగా అరటి, మునగ, బొప్పాయి తోటలు నేలకూలిపోయాయి. ఈ ఘటనతో పలువురు రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. గంభీరం పంచాయతీ పరిధి దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన అడ్డూరి అప్పారావుకు చెందిన 40 సెంట్ల అరటి తోట గాలికి పూర్తిగా నేలమట్టమైంది. అదే గ్రామానికి చెందిన పిల్లా అప్పారావుతో కలిసి నిర్వహిస్తున్న 3 ఎకరాల మునగతోట కూడా కూలిపోయింది. ఆనందపురం గ్రామంలోని పలువురు రైతుల అరటి, బొప్పాయి తోటలు కూడా గాలివాన వల్ల నేలకొరిగాయి. ఆదివారం కావడంతో వ్యవసాయ అధికారులకు సమాచారం అందించలేకపోయామని బాధిత రైతులు చెబుతున్నారు. ఈ నష్టాలను అధికారులు పరిశీలించి తగిన సాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను అంచనా వేసి తగిన నివేదికలు పంపిస్తామని ఉద్యానవన శాఖ అధికారి సోనియా తెలిపారు. సోమవారం గ్రామాల్లో పర్యటించి నష్టాలను అంచనా వేస్తామని ఆమె పేర్కొన్నారు.

నేలకొరిగిన అరటి తోట

నేడు డంపింగ్ యార్డు వద్ద మహాధర్నా

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధిలోని డంపింగ్ యార్డు గేటు వద్ద సోమవారం ఉదయం 6 గంటల నుంచి మహా ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు నాయకులు డి.రమణ తెలిపారు. ఈ డంపింగ్ యార్డు వల్ల సుమారు 16 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. 2013వ సంవత్సరంలో చిన్న స్టాక్ యార్డుగా ఏర్పడిన ఈ డంపింగ్ యార్డులో ప్రస్తుతం రోజుకు సుమారు 250 టన్నులు చెత్తను నిల్వచేస్తున్నారని తెలిపారు. ఇక్కడ 20 నుంచి 30 రోజులు కుళ్లపెట్టి తరువాత టన్నేజు ప్రకారం కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుని ఉప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు కేవలం గాజువాక ప్రాంతంలో ఉన్న చెత్తకు మాత్రమే నిలయంగా ఉన్న ఈ డంపింగ్ యార్డుకు నేడు మల్కాపురం నుంచి షీలానగర్, అనకాపల్లి జిల్లాకు చెందిన లంకెలపాలెం నుంచి కూడా చెత్త మొత్తం ఇక్కడికే తీసుకువచ్చి డంప్ చేస్తున్నారని వివరించారు. జివిఎంసి మున్సిపల్ యాక్ట్ ప్రకారం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డు ఉండాలని ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజల ప్రాణాలను కూడా లెక్క చేయకుండా, నగరం మధ్యలో డంపింగ్ యార్డును పెట్టి, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలని అధికారులకు, రాజకీయ నాయకులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించుకున్నా, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు వచ్చి ఈ డంపింగ్ యార్డును తరలించే బాధ్యత తీసుకుంటామని చెప్పి తర్వాత ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ఈ డంపింగ్ యార్డు రాజకీయ నాయకులు రాజకీయ అజెండాగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ డంపింగ్ యార్డు తరలింపు కోసం చేపట్టే మహా ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న అతిథులు

అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు స్టేడియంలో అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్‌టిపిసి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ కేరళ ఆధ్వర్యాన చేపట్టిన పోటీలను విజువల్లి ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇటువంటి వారిని ప్రోత్సాహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ, దృష్టిలోపం ఉన్న వారు ఆటల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు అడ్వకేట్ శరత్‌బాబు, ఎన్‌టిపిసి అధికారి అనిత్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయకుమార్‌రెడ్డి, పోటీల కోఆర్డినేటర్ అమ్మినాయుడు, నరేష్ పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు

ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 185పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు నాలుగు వికెట్ల కోల్పోయి కేవలం 79పరుగులు మాత్రం చేసి ఓటమి చెందింది. ఢిల్లీ, ఒడిశా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా నిర్ణీత 15ఓవర్లలో మూడు వికెట్లు నష్టానికి 126పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు 14.5 ఓవర్లలో కేవలం 77 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ చిన్నంనాయుడు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనవసర తగాదాల్లో తలదూర్చకుండా ఉండాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో పల్లా సింహాచలం అంత్యక్రియలు

భారీగా హాజరైన ప్రముఖులు, ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక : మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అంత్యక్రియలు ఆదివారం గాజువాకలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం సీతంపేట పరిధి రాజేంద్రనగర్ నుంచి కొత్త గాజువాక ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో ఉన్న పల్లా సింహాచలం పాత నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, కొణతాల రామకృష్ణ, టిడిపి అధ్యక్షులు గండి బాబ్జీ, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, వార్డు కార్పొరేటర్లు, వార్డు టిడిపి అధ్యక్షులు, వైసిపి గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సిపిఎం నాయకుల నివాళి

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం పార్థివ దేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, జోన్ కమిటీ సభ్యులు కె.కిరీటం నాయకులు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.

భారీ జన సందోహం మధ్య అంత్యక్రియలు

కొత్త గాజువాక నుంచి దగ్గరలో ఉన్న శ్మశాన వాటిక వరకు భారీ జన సందోహం మధ్య అంతిమయాత్ర సాగింది. అధికార లాంఛనాలతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. చివరి చూపు కోసం వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.

గాల్లోకి పోలీసుల కాల్పులు

నేటి తరానికి పల్లా సింహాచలం స్ఫూర్తి : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పల్లా సింహాచలం నేటి తరానికి ఆదర్శనీయులని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. పల్లా సింహాచలం పార్థివదేహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పల్లా సింహాచలం బుల్లెట్‌పై తిరుగుతూ కార్మిక నాయకునిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. తాను నర్సీపట్నంలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో పల్లా సింహాచలం దగ్గరకు తరచూ వచ్చేవాడినని చెప్పారు. కార్మిక నాయకునిగా ఆయన చేస్తున్న సేవలను చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంత్యక్రియలకు హాజరైన ప్రముఖులు, ప్రజలు

విద్యా హక్కు చట్టం అమలుచేయాలి

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం-2009ను పటిష్టంగా అమలుచేయాలని వక్తలు డిమాండ్‌చేశారు. ఎల్‌బి.కాలేజి ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్, బాల వికాస్ ఫౌండేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన విద్యా హక్కు చట్టం అమలు తీరు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బాల వికాస్ ఫౌండేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం విద్యా విధానాన్ని ప్రకటించాలని, మీడియం పిల్లల ఐచ్ఛికంగా ఉండాలని, ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలుచేయాలని కోరారు. విద్యావ్యవస్థను కాపాడుకోనేందుకు తల్లిదండ్రులు సమైఖ్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం విధాన ప్రకటన చేయాలన్నారు. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉండేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని, డ్రాపౌట్స్‌ను తగ్గించేలా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కరుణ, విశ్వనాధం, హుస్సేన్, పిసి.రావు, సత్యవతి, నరసింహారావు, చాట్ల బాబూరావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పంచగ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని ఇళ్లు కూలుతున్న వైనం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని ఓ ఇంటిలో స్లాబ్ పెచ్చులు ఊడటం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆదివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇంటి యజమాని నాగరాజు కథనం ప్రకారం.. పంచ గ్రామాల బాధితులమని, ఇల్లు శిథిలమవుతున్నా ఎన్నాళ్ల నుంచో కొట్టుకోవడానికి అనుమతులు లేక, సొంత ఇంటిని విడిచిపెట్టి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఒక్కసారిగా స్లాబు కూలి పడిందని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఇల్లు శిథిలమైందని, కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని అధికారులకు, ప్రజాప్రతినిధులు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని తెలిపారు. ఇల్లు శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ఇటువంటి ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా పరిశీలించి స్లాబ్ వేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా యోగాంధ్ర

ప్రజాశక్తి- యంత్రాంగం

సీతమ్మధార : విశాఖ వేదికగా ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాల్లో భాగంగా ఆదివారం స్థానిక పోర్టు స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర వేడుకలు ఉత్సాహంగా సాగాయి. వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, యూసిడీ మహిళలు, విద్యార్థులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. యోగా శిక్షకుల సూచనలకు అనుగుణంగా వివిధ ఆసనాలు వేశారు. ఉదయం 7.00 నుంచి 8.30 గంటల వరకు యోగాసనాలతో పాటు ఓం శాంతి ఆధ్వర్యాన ధ్యానం కూడా చేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్క అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. యోగా డే రోజున ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు భారీగా హాజరు కానున్నారని, బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఓ భవానీశంకర్, ఆర్‌డిఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : యోగా వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని, అందువల్ల యోగా దైనందిన జీవితంలో భాగం కావాలని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య అన్నారు. పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగ గురువులు మంగియ్య, దొరమ్మ నాయుడు, బి అప్పారావు యోగాసనాలు, బ్రీతింగ్ టెక్నిక్స్ చూపించి అందరితో చేయించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గౌరీపతి, పెద్దఎత్తున వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న కూన వెంకటరావు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో మజ్జిగ వితరణను స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకట్రావు ప్రారంభించారు. మజ్జిగ వితరణకు కూన వెంకట్రావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి సనపల సత్యనారాయణ, మహేశ్వరి పెయింట్స్ ప్రతినిధి కమల్ ఆర్థిక సహాయం అందించారు. వారికి మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సనపల శ్రీకాంత్, అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు, కార్యదర్శి తమ్మినేని వెంకటేశు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కూన వెంకటరావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నెపు తారక రవికుమార్, సనపల వెంకటరావు, మూల లక్ష్మణరావు, సనపల సీతారాం, కోన వాసు, కనుమటి సాయి, పేడాడ మణి, శ్రావణ్‌కుమార్, మాధవధార గ్రామ ప్రజలు సనపల వరాహ నరసింహం, ప్రముఖ న్యాయవాది సనపల నాగచంద్రుడు, పూజారి ఉదయ్‌కుమార్, ఎన్‌టిఎస్ కుమార్, పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే సహించం

ప్రజాశక్తి -ఉక్కునగరం : అకారణంగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సహించేది లేదని, వారి ఉపాధి రక్షణ కోసం పోరాటం చేస్తామని వైఎస్ఆర్‌టియుసి కాంట్రాక్టు కార్మికుల ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1578వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో వైఎస్ఆర్‌టియుసి కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పిట్టారెడ్డి మాట్లాడుతూ భూములు కోల్పోయి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం దాడి చేయాలని చూడడం దుర్మార్గమన్నారు.

అధికార అండ.. అక్రమ దందా

★ పెంటసీమ బోనంగిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు
★ తహశీల్దార్ సిఫార్సు లెటర్ చూపించి దర్జాగా తరలిస్తున్న వైనం
★ పంచాయతీ తీర్మానం, అనుమతి లేకుండానే..
★ తహశీల్దార్, స్థానిక ఎమ్మెల్యే అండదండలున్నట్లు పలువురు ఆరోపణ

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలం పెంటసీమ బోనంగి రెవెన్యూ గ్రామంలో ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల అండదండలతో కొండలు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తూ కోట్లు రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానిక గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ ఫిర్యాదుతో గ్రావెల్ తవ్వకాలు తాత్కాలికంగా ఆగాయి.

మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో ఓ ప్రైవేటు లేఅవుట్‌కు బిటి రోడ్డు ఏర్పాటు కోసం గ్రావెల్ నిమిత్తం పెంటసీమ బోనంగి రెవెన్యూ సర్వే నెంబర్ 2-10/ ఎల్‌పిఎం నెంబర్ 981 పరిధిలోకి వచ్చే 99 సెంట్లు (0.40 హెక్టార్లు)లో తాత్కాలిక క్వారీ లీజు మంజూరు కోసం విఎంఆర్‌డిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి నుండి పరవాడ తహశీల్దార్ కార్యాలయానికి లెటర్ వచ్చింది. వారు క్వారీ లీజుకు కోరిన భూమికి సంబంధించి ఎన్‌ఓసి గురించి తహశీల్దార్ ఆర్‌సి నెంబర్ 171/2025/ఎస్ఎ, తేదీ 02.05.2025లో అనకాపల్లి మైన్స్ అండ్ జియాలజీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయానికి నివేదిక రూపంలో అందజేశారు. దీనికి ఇప్పటి వరకు అనుమతులు మంజూరు కాలేదు.

ఇంతలోనే రోడ్డు కాంట్రాక్టర్ అయిన అరుధి ప్రాజెక్ట్స్ వారు తహశీల్దార్ పంపిన నివేదికలు చూపించి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి తరలించుకుపోతున్నారు. చదునుగా ఉండే భూమి రైస్ గొడౌన్ అనుకొని జగనన్న కాలనీలోనూ, గ్రామస్తులకు ఇళ్ల స్థలాలకు ప్రతిపాదనలు ఉన్న భూమిలోనూ మూడు మీటర్ల లోతులో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. గ్రామస్తులు ఈ ప్రాంతాన్ని పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు. పశువులు మూడు మీటర్ల లోతున్న ఆ గోతుల్లో పడిపోతే వాటి పరిస్థితి ఏమిటని, దానికి ఎవరు బాధ్యులని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు తాత్కాలికంగా ఆగాయి.

ఏదైనా రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరపాలంటే, స్థానిక గ్రామ పంచాయతీ తీర్మానం ఆమోదం పాటు రెవెన్యూ, మైన్స్, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. ఇవి ఏమి పట్టించుకోకుండా నిబంధనలను తుంగలో తొక్కి, అక్రమ గ్రావెల్ దందాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులు పరవాడ తహశీల్దారు, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో అక్రమ సంపాదనకు తెరలేపారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసిన దృశ్యం

ప్రైవేటు లేఅవుట్‌కు తరలించిన గ్రావెల్

పంచాయతీ తీర్మానం లేదు

పెంటసీమ బోనంగి గ్రామం సర్వే నెంబర్ 2లో గ్రావెల్ తవ్వకాలకు గ్రామ పంచాయతీ నుండి ఎటువంటి ఆమోదం లేదు. ఎటువంటి తీర్మానం చేయలేదు. గ్రామ పంచాయతీ అనుమతులు ఇవ్వలేదు.

- బండారు కల్పన రాజశేఖర్, పి.బోనంగి సర్పంచ్

మైనింగ్ శాఖ అనుమతుల్లేవు

సర్వే నెంబర్ 2లో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి నేను ఎటువంటి రిపోర్ట్ ఇవ్వలేదు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రావెల్ తవ్వకాలపై డిటి, ఆర్ఐ తహసీల్దార్‌కు రిపోర్ట్ ఇచ్చారు. మైనింగ్ శాఖ అనుమతులు లేవు.

- శ్రీనివాస్, స్థానిక విఆర్ఓ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పల్లెనిద్రలో ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించే పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్ జనసేన పార్టీ కార్యాలయంలో కొణతాల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు కశింకోట మండలం సోమవరం గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులతో రెండు రోజుల పాటు ప్రభుత్వ పథకాల నిర్వహణపై అవగాహన, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అంశాలపై చర్చించడం జరుగుతుందని చెప్పారు. గ్రామంలో ఉదయం యోగాతో కార్యక్రమం ప్రారంభించి ప్రకృతి వైద్యం, మానవ జీవన ఆహారపు అలవాట్లపై ఒక గంట పాటు సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు క్రీడా పోటీలు, మహిళలకు క్రీడలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు తగిన కార్యక్రమాలను అక్కడ నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొబ్బరి చెట్టు దగ్ధం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది జంక్షన్‌లో వి.మాడుగుల వెళ్లే రోడ్లో ఎన్విఎస్ స్కూల్ వద్ద ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం విద్యుత్ వైర్ల నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కొబ్బరి చెట్టు కాలిపోయింది. ఇది చూసిన ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ఏమాత్రం వైర్లు తెగి కిందపడినా పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. సమీపంలోనే స్కూల్ పిల్లలు సంచరిస్తారు. తరచూ ఇక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని, విద్యుత్ అధికారులు స్పందించి సరి చేయాలని పలువురు కోరారు.

మంటల్లో కాలిపోతున్న కొబ్బరిచెట్టు

బ్రాండిక్స్ ఆధ్వర్యాన నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 139వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 430 మంది రోగులకు నేత్ర వైద్య నిపుణులు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. 44 మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎవికె ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ మూడోరోజు ఆదివారం కొనసాగింది. మజ్జిగ కేంద్రాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ బి.గంగారావు, కోశాధికారి వి.ఎస్ పద్మనాభరాజు ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ ఇన్‌చార్జి జి.ఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ కేంద్రం ఉదయం 11 నుండి మధ్యాహ్నం వరకూ ప్రతిరోజూ నిర్వహిస్తామని, వర్షాకాలం మొదలయ్యేవరకూ కొనసాగిస్తామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, ప్రతిరోజూ ఉచిత మెడికల్ చెకప్, ప్రతీ మూడో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో టైలరింగ్ శిక్షణ కేంద్రం కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ఎం.సూర్యమణి తమతల్లి జ్ఞాపకార్థం రూ.5 వేలు, పోర్ట్ నాయకులు స్వతంత్రకుమార్, గంట పద్మావతి ఎస్.వి.ఎస్. ఎ.ఎల్ శర్మ చెరొక వెయ్యి రూపాయలు చొప్పున విజ్ఞాన కేంద్రానికి విరాళంగా ఇచ్చారు. ఈరోజు మజ్జిగ పంపిణీలో ఎం.ఉమతో బాటు విద్యార్థి నాయకులు అజయ్ (చింటూ), కుసుమ, అంజలి, నరేష్, సంజయ్, భరత్‌సాయి తదితరులు పాల్గొన్నారు. అల్లూరి కార్యక్రమాల కమిటీ సభ్యులు బుజ్జి,సి. హెచ్.సత్యనారాయణ, వై. రాజు తదితరులు నాయకత్వం వహించారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎవికె ప్రతినిధులు

హెచ్ఎంలు, ఎంఇఒలకు

డిప్యూటీ డిఇఒలుగా ప్రమోషన్లు ఇవ్వాలి

ఎపి ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ

మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యా పరంగా నాణ్యతను మెరుగుపర్చడానికి, పర్యవేక్షణ పెంచడానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు డిప్యూటీ డిఇఒలుగా ప్రమోషన్లు కల్పించాలని ఎపి ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల ఏర్పాటు చేసిన క్లస్టర్ హైస్కూల్ హెడ్ మాస్టర్ పోస్టులను గ్రేడ్ -1 హెచ్ఎం పోస్టుగా అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ తయారు చేసి ప్రమోషన్స్ చేపట్టాలని కోరారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం పోస్ట్ పేరును మార్పుచేయాలన్నారు. హెచ్ఎంలపై పనిభారం తగ్గించాలని కోరారు. అధికారులు ర్యాంకుల కోసం పరుగులు పెడుతూ, సొంత ఎజెండాలతో విపరీతమైన ఒత్తిడి పెడుతున్నారని, దీనితో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలోనై అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర శాఖలలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరినవారు డీఈవోలు, ఆర్‌జెడిలుగా రిటైర్ అవుతున్నారని, 16 నుండి 20 సంవత్సరాలు సర్వీస్ చేసిన హెచ్ఎంలు, ఎంఇఒలకు ప్రమోషన్ లేకుండా రిటైర్ అయిపోవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పింఛన్‌దారుల కోసం వెంటనే వేతన సవరణ సంఘం (పిఆర్సి) కమిటీ నియమించి ఇంటీరియర్ రిలీఫ్ (ఐఆర్)ను ప్రకటించాలని కోరారు. ఉద్యోగులకు డిఎ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సివివి.సత్యనారాయణ, సభ్యులు కె.సత్యనారాయణ, సిహెచ్.రవి, సహాధ్యక్షులు వి.నూకరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎవిహెచ్.శాస్త్రి, కార్యదర్శి ఎం.జె.రవీంద్రబాబు, కోడి శ్రీనివాసరావు, వరాహమూర్తి, శేషగిరిరావు, శ్రీరామమూర్తి, రామస్వామినాయుడు, శేఖర్ పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది కేవిడి జెడ్పీ హైస్కూల్లో 1998-99లో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 26 ఏళ్ల తరువాత ఆదివారం కలిశారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న హైస్కూల్లోనే సమావేశమై నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్ విద్యార్థి వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ తన సొంత నిధులతో ప్రతి ఏటా టెన్త్ టాపర్‌కి రూ.10,116 నగదు పురస్కారాన్ని అందిస్తానని తెలిపారు. 2001-02 బ్యాచ్ విద్యార్థులు కూడా 23 ఏళ్ల తరువాత కలిశారు. క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను సత్కరించారు. తమ బ్యాచ్లో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను ఆదుకోవడానికి తీర్మానించుకున్నారు.

'డెక్' భవనం పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వీఎంఆర్డీఏ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక భవన సముదాయం 'డెక్' భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదివారం వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవనం బాహ్యంగా ఆకర్షణీయంగా ఉండేలా అంతర్గాంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీ ఖరారు అయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. భవనం లోపల చిన్నపాటి లోపాలను సైతం గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డెక్ భవనాన్ని పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్

మృగశిర కార్తె ఆరంభంతో చేపలకు డిమాండ్

ప్రజాశక్తి-వడ్డాది, బుచ్చయ్యపేట : మృగశిర కార్తె అనగానే గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభం రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలకు డిమాండ్ పెరిగింది. మృగశిర కార్తెతో వర్షాకాలం ప్రారంభమైందని అంటారు. కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతూ ఉంటారు. వేసవిలో ఉష్ణోగ్రతలతో శరీరంలో వేడి ఎక్కువ ఉంటుందని అది చేపలు తినడం వల్ల దూరమవుతుందనేది పెద్దల మాట. రోహిణి కార్తెలో వేడెక్కిన శరీరం చల్లబడేందుకు పోషక విలువలు పొందేందుకు చేపలు తినాలనేది ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో సాధారణ రోజుల కంటే ఈ ఆదివారం చేపలకు విపరీతంగా డిమాండ్ పెరిగిందని వడ్డాది ఫిష్ మార్కెట్లో చేపల వ్యాపారి కనక తెలిపారు. లక్ష్మీపురం చెరువు, పెద్దేరు డ్యాం నుండి చేపలను తెచ్చి వడ్డాదిలో విక్రయిస్తున్నారు. సందువ, బంగారు పాప, బొచ్చు, రాగి వెండి రకాల చేపలు తెచ్చారు. చేపలు రకాలను బట్టి కిలో రూ.150 నుండి రూ.300 వరకు, రొయ్యలు రూ.300కు విక్రయించారు. గ్రామీణ ప్రాంతాల్లో వాడవాడ తిరుగుతూ వ్యాపారులు చేపలు విక్రయించారు.

వడ్డాదిలో చేపలు విక్రయిస్తున్న వ్యాపారి

ఇసుకాసురులు

- శారద నదిలో ఇష్టానుసారం అక్రమ తవ్వకాలు
- భయాందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తిమిరాం గ్రామంలో ఇసుకాసురుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఉచిత ఇసుక పథకాన్ని అడ్డం పెట్టుకుని తిమిరాం గ్రామం వద్ద శారద నదిలో ఇసుకను ఊడ్చేస్తున్నారు. నదిలో ఎంత లోతు తవ్వాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఇసుక వ్యాపారులు వాటిని బేఖాతరు చేస్తున్నారు.

మండలంలోని తిమిరాం గ్రామ శివాలయానికి ఎదురుగా శారదానది ప్రవహిస్తోంది. ఇక్కడ నదీ తీరంలో ప్రతి శుక్రవారం పశువుల సంత జరుగుతుంది. అలాగే తిమిరాం నుంచి మామిడిపల్లి తదితర గ్రామాలకు ఈ నదిలో నుండే రాకపోకలు సాగిస్తారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు తప్ప మిగిలిన సమయంలో గతంలో నది దాటి సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేరుకునే వారు. అయితే ఇప్పుడు ఇష్టానుసారంగా శారద నదిలో ఇసుక తవ్వేస్తుండటంతో గతంలో ఓ యువకుడు గొయ్యిలో పడి మృతి చెందాడు. తాజాగా అదే ప్రాంతంలో సుమారు 15 నుంచి 20 అడుగుల లోతులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసంలో నదిలో మహిళలు స్నానాలు చెయ్యడానికి వెళ్లే దారిలోనూ, రజకులు నిత్యం బట్టలు ఉతికే ప్రాంతంలోనూ కూడా విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. అలాగే ఇదే ప్రాంతంలో ప్రతి ఏడాది తీర్థం జరిగే సమయంలో ఎడ్ల పందేలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు దర్జాగా చేస్తున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ దందాను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇసుక ఎంత లోతు వరకు తవ్వవచ్చో స్పష్టమైన ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటిని ఎవరూ పాటించడం లేదు. నదీ పరిరక్షణ నామమాత్రంగా మిగిలిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

నదీ ప్రవాహానికి అడ్డంగా తవ్వకాలు జరుగుతున్నాయి. దీని వల్ల తక్కువ స్థాయిలో వరద వచ్చినా నేను వేసిన సిరిగంధం తోట కొట్టుకుపోతుంది. అదే జరిగితే నాకు కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అధికారులెవరూ స్పందించకపోతే కలెక్టరుకు ఆధారాలతో ఫిర్యాదు చేస్తాను.

- రెడ్డి సింహాద్రప్పుడు, రైతు తిమిరాం గ్రామం

తిమిరాం వద్ద శారద నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జనసేన నేత రాజు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో వివిఎస్ఆర్ సేవా ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు, స్థానిక జనసేన పార్టీ నాయకులు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. విశాఖకు చెందిన పలు కార్పొరేట్ ఆసుపత్రుల ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. రోగులకు గుండె సంబంధిత పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. సుమారు 350 మందికి వైద్య సేవలు అందించారు. విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి నుండి ఆంకాలజిస్టులు పాల్, మురళీకృష్ణ, హరిక, పిఆర్వో పీఎం నాయుడు, ఎన్నారై ఆసుపత్రి నుండి వైద్య నిపుణులు పరమేశ్వరరావు, హరి కిషోర్, సుజిత్ కుమార్, సౌమ్య, హేమంత్, సుజాత, పిఆర్ఓ త్రినాధ్ బృందం సేవలు అందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక జనసేన యూత్ లీడర్లు కోట శేషు, కోట అమర్, సుంకర దేవి ప్రసాద్, జెర్రిపోతుల నాయుడు, రమణ, మరిశా సూరి దేముడు, మరిశ కటాలు, మరిసా బుజ్జి, నగేష్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పాత ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కోసం మండలంలోని 700 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అందులో ఎంపికైన వారికి రెండు దశల్లో 90 రోజులపాటు శిక్షణ పూర్తి చేసి ఉచితంగా కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేయనున్నట్లు చెప్పారు. కుట్టు మిషన్ శిక్షణలో ప్రతి మహిళా నైపుణ్యం సాధించి వారి జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వారికి మరిన్ని అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రునాయుడు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు గొర్లెపోటు రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ సర్పంచులు చాలా తాతయ్యలు, పూడి సత్యారావు, అవుగడ్డ కోటిపల్లి నాయుడు, టిడిపి నాయకులు శరభాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, కడిమి నాగేశ్వరరావు, క్రరి నాయుడు, బీసీ కార్పొరేషన్ కుట్టు మిషన్ శిక్షణ కోఆర్డినేటర్ కె.రవికుమార్, ట్రైనర్ సంతోషి, కంప్యూటర్ ఆపరేటర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖకు నారా లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం విశాఖ వస్తున్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల పాటు పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకొని అక్కడ నుంచి11 గంటలకు పార్వతీపురం పట్టణంలోని రాయల్ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. 11 గంటల నుంచి 1.30 గంటల వరకు రాయల్ కన్వెన్షన్‌లో జరిగే 'షైనింగ్ స్టార్స్ అవార్డ్' కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్వతీపురం మండలం చిన్న బొండపల్లిలో ఉత్తమ కార్యకర్తలు, నియోజకవర్గ సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం చేరుకొని 10.45 గంటలకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఇంటిని సందర్శించనున్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విశాఖ కలెక్టరేట్‌లో యోగాంధ్ర కార్యక్రమంపై నిర్వహించే సమీక్షలో పాల్గొంటారని అధికారిక ప్రకటన వెలువడింది.

టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక సంబంధించి ఫిర్యాదులను నేరుగా గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి గాని నమోదు చేయించుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని, సమాచారం తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలోనూ, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాలలోనూ, అన్ని మండలాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం యధావిధిగా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లాలో సోమవారం నిర్వహించాల్సిన షైనింగ్‌స్టార్ అవార్డ్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, వివిధ జిల్లాల ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున సోమవారం 9వ తేదీన జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయబడిందని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా వీఎంఆర్డీఏలో ఈ నెల 21న జరగుతున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లలో అధికారులంతా నిమగ్నమై ఉన్నందున కూడా రద్దు చేస్తున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

అనకాపల్లిని వాకర్స్ జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాను వాకర్స్ జిల్లాగా తీర్చిదిద్దాలని వాకర్స్ క్లబ్ అనకాపల్లి జిల్లా గవర్నర్ కే ద్వారకానాథ్ పేర్కొన్నారు. ఆదివారం వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డిడి నాయుడు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం జిల్లా-101 గవర్నర్ వాకర్ కె.ద్వారాకానాథ్ మాట్లాడుతూ అనకాపల్లి నుండి చాలా మంది గవర్నర్లు, కేబినెట్ కార్యదర్శులు, ఏవిపిలు పదవులు చేపట్టారని, రాబోయే కాలంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా కూడా అనకాపల్లి నుండే ఎన్నికవ్వాలని కోరారు. అనంతరం డాక్టర్ డిడి నాయుడు, గవర్నర్ కె ద్వారాకానాథ్, 2026కు గవర్నర్‌గా ఎన్నికైన అనకాపల్లి వాసి ఆర్ఆర్ఎస్ మహేశ్వరరావు, జిల్లా కోశాధికారి డి.లక్ష్మణరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వాకర్స్ పూర్వపు అధ్యక్షులు కెవి గౌరీపతి, డాక్టర్ శరగడం సూరకరాజు, టీఎస్ అప్పారావు, నల్లాల దేవుళ్ళు, వాకర్స్ ఆడారి మల్లికార్జునరావు, దాడి సూరిబాబు, పీలా అరుణాచలం, కెవివి సత్యనారాయణ, సిహెచ్ నరసింగరావు, అధిక సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆదివారంతో ముగిసింది. హెచ్‌ఎంఐఇఎస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ - ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వర్క్ షాప్‌లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంఐఇఎస్ సంస్థ సిఇఒ హిరావత్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం పైథాన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యతను వివరించారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా మెళకువలు నేర్చుకుని భవిష్యత్తులో మార్గదర్శకులుగా ఉండాలని అధ్యాపకులకు సూచించారు. వర్క్ షాప్ కో-ఆర్డినేటర్లుగా అధ్యాపకులు కిరణ్‌కుమార్, పరమేష్ వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలోని పాకలపాడు శివారు గ్రామం వెంకటరాంపురం దామరాజు వెంకటరామరాజు ఆశ్రమం నుండి పుత్తడి గైరంపేట గ్రామానికి బాబు ఉత్సవ విగ్రహాలు పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని ఇంటింటా హారతులిచ్చారు. ముఖ్య అతిథులుగా ఆశ్రమం నిర్వాహకులు సోమయాది, వెంకటరాంపురం గ్రామస్తులు చిన్నబాబు, పల్లపు నాగేంద్రపాలెం గ్రామస్తులు సబ్బవరపు అప్పలనాయుడు, పుత్తడి గైరంపేట గుడి పూజారి పుత్తడి అప్పలనాయుడు, రమణబాబు, పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే జోగులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కంబాలజోగులు

ప్రజాశక్తి - పాయకరావుపేట,: మండలంలోని కుమారపురం పంచాయతీ, పెద్దూరు రత్నయమ్మ పేటలో ఆదివారం జరిగిన నీలాపు రాంబాబు రెడ్డి కుమారుడు సంజీవ్ రెడ్డి, కమలా దేవిల వివాహానికి మాజీ ఎమ్మెల్యే, వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తజంటకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాయకరావుపేట వైసిపి మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, ఎంపిపి ఇసరపు తాతారావు, పార్టీ సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబురావు, జగతా శ్రీను నీలాపు బాలకృష్ణ రెడ్డి, చిరంజీవి రెడ్డి, మహేష్ రెడ్డి, గోవింద్‌రెడ్డి, వైస్ ఎంపిపి ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పుల్ల మామిడిలో నీటి కష్టాలకు చెక్

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పుల్లమామిడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి గ్రామంలోని తాగునీటి బావిలో కుక్కను చంపి పడవేయడంతో గ్రామస్తులు నీరు వాడలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఘటనను దష్టిలో ఉంచుకుని, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ గడుతూరి స్వర్ణలత, చౌడుపల్లి సర్పంచ్ లలిత గ్రామాన్ని సందర్శించి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీటి ట్యాంకుల ద్వారా కొన్నాళ్లుగా మంచినీటి సరఫరా చేపట్టామని, త్వరలోనే పెండ్లిమామిడి గ్రామం నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి శుద్ధజలాన్ని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. బావినీరు తాగి కొంతమంది అస్వస్థతకు గురవడంతో, ఎఎన్‌ఎం సరమండ ప్రవల్లిక ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు!

అక్రమ మైనింగ్‌లు మళ్లీ సన్నాహాలు చేస్తున్న మాఫియా

జనసేన రాజుకు ఫిర్యాదు చేసిన రాజన్నపేట గ్రామస్తులు

చెరువు గర్భంలోని అక్రమ రోడ్డుకు గండికొడుతున్న అధికార్లు (ఫైల్)

ప్రజాశక్తి-రోలుగుంట : అధికారుల ఆదేశాలు, హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మండలంలోని రాజన్నపేట గ్రామంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్‌ఎన్.రాజు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్, ఇరిగేషన్ శాఖ అధికారులు రంగంలోకి దిగి, రాజన్నపేట క్వారీ ప్రాంతానికి అనుకొని ఉన్న చెరువు గర్భంలో నిర్మించిన అక్రమ రహదారిని గుర్తించి, దానిని తవ్వేసి, అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నారు. అంతేగాక, అక్రమంగా రోడ్డు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేసి, రహదారిని తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే కొద్ది రోజుల స్తబ్ధతగా ఉన్న మైనింగ్ మాఫియా మళ్లీ దూకుడు పెంచి, అధికారులు గండికొట్టిన రహదారిని తిరిగి పూడ్చివేసి బండరాళ్ల రవాణాకు సన్నాహాలు చేస్తున్నారు.. ఈ పరిణామాల నేపథ్యంలో, స్థానికులు పివిఎస్‌ఎన్.రాజును కలిసి తమ గోడు వెల్లబుచ్చుకున్నారు.

దీంతో సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అధికారుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, ఎవరి అండతో లీజుదారులు రెచ్చిపోతున్నారో అంతుపట్టడం లేదని పివిఎస్‌ఎన్.రాజు ప్రశ్నించారు. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న లీజుదారుల లైసెన్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే జనసేన పార్టీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందని హెచ్చరించారు.

సాగు, సస్యరక్షణపై రైతులకు అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలోని చినపాచిల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు సాగు, సస్యరక్షణ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆదివారం సర్పంచ్ కోమటి రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం సత్తిబాబు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త సత్తిబాబు మాట్లాడుతూ తొలకరిలో సాగుయాజమాన్య పద్ధతులపైనా, భూసార పరీక్ష విశిష్టత, పైర్లకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల వరివంగడాల గుణగణాలను వివరించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి వచ్చిన డాక్టర్ ఎం. వెంకటేశం, డాక్టర్ టి.కిరణ్ ఎరువుల యాజమాన్యం, అధిక పంట దిగుబడులకు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు సెంటర్ మెరైన్ ఫిషరీస్ ఇన్స్టిట్యూట్ అధికారిణి డాక్టర్ ఎం. ఇందిర మాట్లాడుతూ మత్స్యకారులకు, మత్స్యకార రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యరకమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం.రాజ కుమార్, డాక్టర్ టి. కిరణ్‌కుమార్, ఎం.వెంకటేష్, పి.పద్మావతి, డాక్టర్ ఎన్.కిషోర్, డాక్టర్ పి.బాబు, ఎంఎఒ డి.రూప, విఎఎ ఎల్.మాధురి పాల్గొన్నారు.

యాంత్రీకరణతో కూలీల కొరత నివారణ

కోటవురట్ల: వరి సాగులో యాంత్రీకరణతో కూలీల కొరత నివారించుకోవాలని బిసిటి కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్త వి ప్రసాదరావు సూచించారు. ఆదివారం బోడపాలెం, సుంకపూర్ గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజినీ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే గొర్రెతో ఎదపెట్టడం ద్వారా ఖరీఫ్‌గా అత్యధికంగా సాగు చేసే రైతులు వరినాట్లు చేసుకోవాలన్నారు, ఎఒ సరోజినీ మాట్లాడుతూ వరిలో నూతన రకాలైన ఎంటియు 1224, ఎంటియు 1262, ఎంటియు 1318, రకాలతో అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు పిఎండిఎస్ కిట్లు రూపంలో విత్తనాలు అందజేస్తామన్నారు, సర్పంచులు కాశీ లక్ష్మి, ఎరుకునాయుడు, సిబ్బంది త్రినాథ్ పాల్గొన్నారు.

వుడా మాస్టర్ ప్లాన్ రహదారి పూర్తయ్యేనా?

అధ్వానంగా ఉన్న రేవళ్లపాలెం రోడ్డు

ప్రజాశక్తి -మధురవాడ : దశాబ్ద కాలం గడిచినా ఓ రహదారి నిర్మాణం పూర్తికావడంలేదు. జివిఎంసి 6వ వార్డు పరిధి మధురవాడ కూడలి నుంచి నవోదయ వరకు ఉడా మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మాణం పదేళ్ల కిందట చేపట్టారు. ఈ నిర్మాణం అధిక శాంతం పూర్తయింది. మార్గమధ్యలో రేవళ్లపాలెం వద్ద టిడిఆర్ సమస్య వల్ల కొంత భాగం నిర్మాణం జరగలేదు. దీంతో అక్కడ రహదారి గోతులు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు గమనించలేక ప్రమాదాలకు గురయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఆ రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న జానపద కళా సంబరాలు

వేదికపై మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర నవచైతన్య కళా నాట్య సంఘం 22వ వార్షికోత్సవాన్ని ఆరిలోవలో ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన జానపద కళా సంబరాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కళన్ని నమ్ముకోవాలని, ప్రజల్ని చైతన్య పరిచే కళతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం అతిథుల ద్వారా కళా బృందాల గురువులకు సన్మానించారు. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు. మహిళా కోలాటం పోటీల్లో గెలుపొదిన విజేతలకు బహుమతులు అందజేశారు. నవచైతన్య కళా నాట్యం సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పిల్లి వీర్రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు, సంఘం నాయకులు చిన్నారెడ్డి, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, పిల్లి చిలకమ్మ, అట్టాడ లక్ష్మీనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా!

చెరువులో స్నానానికి దిగి ముగ్గురు గిరిబాలల దుర్మరణం

బిల్లపుట్టు, గంగవలస గ్రామాల్లో విషాదం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గంగవలసలో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం చెరువులో స్నానానికి వెళ్లి, ఈత సరదాతో నీటిలో దిగిన ముగ్గురు గిరి విద్యార్థులు బురద ఊబిలో చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. వేసవి సెలవుల్లో సరదాగా బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. వీరి మరణంతో గంగవలస, బిల్లపుట్టు గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దీనికి సంబంధించి గ్రామస్తులతోపాటు బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి.

గుంటసీమ పంచాయతీ కేంద్రానికి అనుకొని ఉన్న గంగవలసకు చెందిన కొర్ర సుశాంత్(14), పోతంగి పంచాయతీ బిల్లపుట్టు గ్రామానికి చెందిన గుంట భానుతేజ (14), గుంట సాయి కిరణ్(14) ముగ్గురు గిరిజన విద్యార్థులు ఆదివారం ఉదయం సరదాగా స్నానం చేయడానికి గ్రామానికి సమీపంలో గల చెరువుకు వెళ్లారు. ఈతసరదాతో చెరువులో దిగగా, నీరు లోతుగా ఉండడంతో పాటు బంకమట్టి ఊబి ఉండడంతో కూరుకుపోయి బయటికి రాలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఒకేసారి రెండు గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతితో రెండు గ్రామాల్లో తీవ్ర విషాద యలు అలుముకున్నాయి.

బిల్లపుట్టుకు చెందిన భానుతేజ్ నర్సీపట్నంలో 9వ తరగతి చదువుతుండగా, సాయి కిరణ్ అరకులోయ సిహెచ్ స్కూల్‌లో చదువుతున్నాడు. గంగవలసకు చెందిన సుశాంత్ గుంట సీమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బిల్లపుట్టుకు చెందిన ఇద్దరు విద్యార్థులు వేసవి సెలవులు కావడంతో గంగవలసలోని వారి మేనమామ ఇంటికి చుట్టాలుగా వెళ్లారు. గ్రామంలోని భానుతేజ్ అనే విద్యార్థితో కలిసి సరదాగా స్నానానికై వెళ్లగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విషయం గ్రామస్తులకు అందడంతో చెరువులో వెళ్లి మృతదేహాలను బయటకు తీశారు. సరదాగా ఆడుతూ పాడుతూ ఉండాల్సిన చిన్నారులు చెరువులో మునిగి విగత జీవులుగా మారడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందిన సమాచారం మేరకు డిఎస్‌పి, పోలీస్ సిబ్బందితో గంగవలస గ్రామానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి : సిపిఎం

ఉపాధి హామీ పథకంలో నిర్మించిన చెరువులో స్నానానికి వెళ్లి దిగి ముగ్గురు గిరి విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబీకులకు ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి జోక్యంతో ఇళ్ల నిర్మాణ అనుమతులు

సదాశివనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ హర్షం

అనుమతి పత్రాలను అందజేస్తున్న విల్లూరి చక్రవర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ జోక్యంతో సదాశివనగర్ ప్లాట్ ఓనర్స్‌కు ప్రయోజనం చేకూరిందని, ఎట్టకేలకు నిర్మాణాలకు వియంఆర్‌డిఎ అధికారులు అనుమతులు మంజూరు చేశారని టిడిపి విశాఖ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఆనందం వ్యక్తం చేసారు. ఆదివారం సదాశివ నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమోటర్, డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ సమావేశంలో అసోసియేషన్ సభ్యులందరికీ వియంఆర్‌డిఎ అధికారులు మంజూరు చేసిన ఎల్‌పి 1/2024 ధ్రువీకరణ పత్రం, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను అందచేశారు.

ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాల అనుమతులకు సుదీర్ఘకాలం అసోసియేషన్ సభ్యులందరూ పోరాటం చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు సమస్యను వివరించగా, వారు వెంటనే స్పందించి వియంఆర్‌డిఎ అధికారుల వివరణ కోరడంతో వెంటనే అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున వారికి ధన్యవాదాలు తెలిపారు.కూటమి ప్రభుత్వ పాలనలో అన్నివర్గాలకు పారదర్శకంగా పనులు జరుగుతున్నాయన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌శర్మ, పివిఎస్‌ఎన్ గుప్తా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

12న అప్పికొండమ్మ జాతర

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఈ నెల 12న అప్పికొండమ్మ తల్లి జాతర నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ పనులు చేపడుతున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

భూలోకమ్మ ఆలయం ప్రారంభం

ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి - రావికమతం: మండలం గుడ్డిప గ్రామంలో నూతనంగా నిర్మించిన భూలోకమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో చోడవరం ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా. ఎమ్మెల్యే రాజుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, భూలోకమ్మ ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మామిడి, స్కంద, తులసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు శ్రీవాణి, జనసేన కార్యదర్శి రమేష్ బాబు, సుంకరి కోటి, గొంప ఎంపిటిసి గెంజి సూర్యనారాయణ, గ్రామ టిడిపి నాయకులు మజ్జి కొండయ్య, మాజీ సర్పంచ్ గల్లా సత్యారావు, గల్లా నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సేవలో విఆర్‌ఎలు

ప్రజాశక్తి-కోటవురట్ల : ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు, తమపైస్థాయి అధికారుల సేవల్లో తరించడంపై స్థానికంగా పలువురు విస్మయానికి గురౌతున్నారు. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో నిత్యం సాక్షాత్కరిస్తున్న ఘటన పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ కారును ఇద్దరు విఆర్‌ఎలు శుభ్రపరచడం ఇక్కడ నిత్య కృత్యంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయం ఎదుటే బాహాటంగానే సాగుతున్న ఈ తంతును చూసి మండల వ్యాప్తంగా పలువురు నాయకులు, ప్రజలు పెదవి విరిస్తున్నారు, గ్రామాల్లో, కార్యాలయాల్లో ప్రజలకు సేవ చేయాల్సిన విఆర్‌ఎలు, ఇలా తమ పైఅధికారికి ఊడిగం చేయమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో కోకొల్లలుగా రెవెన్యూ సమస్యలు, ప్రజాసవరాలు ఉండగా, వాటన్నింటినీ గాలికొదిలేసి ఇలా కార్యాలయంలో పైఅధికారి సేవలకు విఆర్‌ఎలు పరిమితం కావడంతో మండల వ్యాప్తంగా వివిధ సమస్యలకు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి

కార్యాలయం వద్దే డిటి కారును శుభ్రం చేస్తున్న గ్రామసేవకులు

ఉందంటున్నారు. గ్రామాల్లో స్థానికులైన విఆర్‌ఎలు, గ్రామాల్లో ఉంటేనే ఏదైనా సమస్యపై అవగాహనతో ప్రజలకు సేవ చేసే ఆస్కారం ఉంటుందని, అలాకాకుండా ఇలా కార్యాలయ అధికారుల సేవలో తరించడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక సందర్భాల్లో అసౌకర్యం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి రెవెన్యూ సేవకులను వ్యక్తిగత సేవలకు కాకుండా, గ్రామాలల్లో ప్రజాసేవకు పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

యాదాల చరణ్

కొండ్ర సతీష్

ప్రజాశక్తి -నక్కపల్లి : 2024-2025 విద్యాసంవత్సరానికి మండలంలోని ఇద్దరు 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఎంఇఒ కె నరేష్ తెలిపారు. మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి యాదాల చరణ్, ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కొండ్ర సతీష్ ఎస్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారన్నారు. వీరికి నాలుగేళ్లపాటు ఏటా ప్రభుత్వం ఆర్థికసాయం అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.జయశ్రీ, కె.నాగన్నదొర, ఉపాధ్యాయులు అభినందించారు.

మనువాదంతో దేశసంపద కార్పొరేట్ల పరం

◆ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల విలీన సభలో ఉస్మానియా ప్రొఫెసర్ కాశీం

మాట్లాడుతున్న ఉస్మానియావర్సిటీ ప్రొఫెసర్ కాశీం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే స్థాయికి మనువాదం చేరుకుందని, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం అన్నారు. ఆదివారం డాబా గార్డెన్స్, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ, సాంస్కృతిక సమాఖ్యల విలీనం సందర్భంగా నిర్వహించిన సాహిత్య సభలో మాట్లాడుతూ పాలకవర్గాల భావాలే ప్రజల భావాలుగా చేసి దోపిడీ వర్గం దోచుకుంటుందన్నారు. రాజకీయ కార్యాచరణ ద్వారా మార్క్సిజం లెనినిజం మావోయిజం భావాలున్నవారు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నేడు దేశంలో మోడీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని మావోయిస్టులని చంపుతోందన్నారు. ప్రజా ఉద్యమంలో సాంస్కృతిక రంగం పాత్ర కీలకమని, ఇటువంటి తరుణంలో కళారూపాలతో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అరుణోదయ కళాకారులు కృషి చేయాలని సూచించారు.

రైటర్స్‌అకాడమీ ఛైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ, మందసలో ఎయిర్‌పోర్టు భూముల రక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హిందూ మతోన్మాదంపై వేణు ఆలపించిన గానం అందర్నీ ఆలోచింపజేసింది. సభకు అధ్యక్షత వహించిన నాగరాజు అమర కళావీరులను స్మరిస్తూ తీర్మానం చేశారు. ముందుగా సరస్వతి పార్కు నుండి సభావేదిక వరకు అరుణోదయ కళాకారుల కళా ప్రదర్శన ఆటపాటలతో ర్యాలీగా సాగి అందర్నీ ఆకట్టుకుంది. అరుణోదయ కళాకారులు ఆలపించి ప్రదర్శన చేసిన ‘ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు’ రూపకం ఆలోచింపజేసింది. కార్యక్రమంలో తెలంగాణ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు వేణు,ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, రాష్ట్రకార్యదర్శులు అంజయ్య, కె.నిర్మల, రాష్ట్ర కోశాధికారి ఎస్ జయలక్ష్మి, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు ఎం లక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వర్లు, న్యాయవాది చలం, సిఎంఎస్ లలిత, రోహిణి పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

కొయ్య విద్యాసాగర్

పోతంశెట్టి గన్నెమ్మ

బొడ్డు నాగస్వాతి

మామిడి గాయత్రి

బద్ది జయకృష్ణవంశీ

చీడిపల్లి వైష్ణవి కీర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు మండలంలో ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఇఒ కె నరేష్ వెల్లడించారు. వేంపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి కొయ్య విద్యాసాగర్ (588) మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, అదే పాఠశాలకు చెందిన విద్యార్థి పోతంశెట్టి గన్నెమ్మ (577) నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బొడ్డు నాగస్వాతి (577) మార్కులతో రెండవ స్థానంలో నిలిచారని,అదే పాఠశాలకు చెందిన విద్యార్థి మామిడి గాయత్రి (576), నక్కపల్లి గురూస్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి బద్ది జయకృష్ణ వంశీ (571), గురుకుల పాఠశాల విద్యార్థి చీడిపల్లి వైష్ణవికీర్తి (514) ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల అనకాపల్లిలో పెంటకోట కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లాకలెక్టర్, డిఇఒ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఒకొక్కరికి రూ.20 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారన్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వేడుకకు హాజరుకావాలని కోరారు.

ఆరుగురికి ప్రతిభా అవార్డులు

రావికమతం: 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఇఒ తలుపులు తెలిపారు మండలంలో గర్నికం కెజిబివికి చెందినకలిగిరి వర్షిత లాస్య (568), రావికమతం సిద్ధార్థ హైస్కూల్^ు చెందిన మట్ట హేమచంద్ (582, కొత్తకోట ఎఆర్‌కె బర్డ్ పాఠశాలకు చెందిన ఎస్.ఉదయప్రసాద్‌నాయుడు (587, కొత్తకోట సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన పల్లా రామకృష్ణ (580), కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. భవన శ్రీ (534) మార్కులు, రావికమతం గర్ల్స్ హై స్కూల్‌కు చెందిన జె .దివ్య (536) షైనింగ్ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. కేటగిరీల వారీగా . ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఒక్కొక్కరికీ, బిసి‘డి’, ఒసి కేటగిరీ విద్యార్థులు చెరో ఇద్దరికి అవార్డులు దక్కాయన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డు విజేతలకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి : షైనింగ్ స్టార్స్‌కు అవార్డులకు దేవరాపల్లి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వేచలం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గుంపాన ఉదయ్ కుమార్(590), తిమిరాం మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థులు మురకుతి దేవానంద్ (578), శ్రీనాథ జయకృష్ణ(549), దేవరాపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని చెరుకూరి మౌనిష (560), పెదనందిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి పెంట జయశ్యాం కుమార్(521), దేవరాపల్లి కైరళీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి బి.హర్షిత (567) ఎంపికయ్యారు. ఆదివారం దేవరాపల్లి విచ్చేసిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైన విద్యార్థులను అభినందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముషిడిపల్లికి చెందిన డబ్బూరు సన్యాసయ్య, అప్పలనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సమకూర్చిన ప్రోత్సాహక బహుమతుల్ని విద్యార్థులకు అందజేశారు.

కె.కోటపాడు : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు “షైనింగ్ స్టార్స్” అవార్డులతో ఈ నెల 9న సత్కరించడం జరుగుతుందని స్థానిక ఎంఈఓ కే సత్యనారాయణ తెలిపారు. కె.కోటపాడు మండల స్థాయిలో గొండుపాలెం హైస్కూల్‌కు చెందిన సత్యవరపు సాహితి, కె.కోటపాడు వేణు విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన కొట్యాడ భవాని, పొన్నగంటి జస్వంత్, జాగరపు దుర్గా హేమని, పాతవలస హైస్కూల్‌కి చెందిన కాకర్ల అలేఖ్యను ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు.